# చిన్నగొట్టిముక్కలో నేడు అల్పాహారం ప్రారంభం

శివ్వంపేట, అక్టోబర్ 5:మండల పరిధిలోని చిన్నగొట్టిముక్క గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'అల్పాహారం' పథకాన్ని నేడు (శుక్రవారం) ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మహిళా కమిషన్ చైర్పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, కలెక్టర్ రాజర్షి షా ప్రారంభిస్తారని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ తెలిపారు. గురువారం ఎంపీడీవో భారతి, సర్పంచ్ బాలమణినరేందర్‌తో కలిసి ఎంపీపీ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే మండలంలోని ఏదుల్లాపూర్‌లో ప్రారంభించే 'రాక్‌గార్డెన్'ను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ చిన్నగొట్టిముక్క పాఠశాలలో ఉదయం 8.30 గంటలకు 'అల్పాహారం' ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతి రెడ్డి, ఎంపీటీసీ దశరథ, ఉపసర్పంచ్ పాండురంగం, కార్యదర్శి రాఘువేంద్ర, ఫారెస్టు సెక్షన్ అధికారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, ఎంపీడీవో భారతి

### గూడురులో అభివృద్ధి పనులు ప్రారంభం

☛ శివ్వంపేట మండలం గూడురులో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి ఉదయం 11గంటలకు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. గ్రామంలో దాదాపు రూ.కోటి 20 లక్షల నిధులతో పూర్తైన సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, వైకుంఠధామం, డంపింగ్‌యార్డు, పల్లె ప్రకృతి వనం పూర్తి కాగా వాటిని ప్రారంభిస్తారని సర్పంచ్ వెల్లడించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ కోరారు.



కూచన్‌పల్లిలో స్పోర్ట్స్ కిట్స్ అందజేస్తున్న ఎంపీపీ నారాయణరెడ్డి

## క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం

మెదక్ రూరల్, అక్టోబర్ 5: తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను మరింత ప్రోత్సాహం అందించడానికే ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలను నిర్మించి 'కేసీఆర్ స్పోర్ట్స్ కిట్స్' అందజేస్తున్నదని హవేళీఘన్‌పూర్ ఎంపీపీ శేరి నారాయణరెడ్డి అన్నారు. గురువారం కూచన్‌పల్లి పంచాయతీ కార్యాలయంలో క్రీడాకారులకు ఎంపీపీ స్పోర్ట్స్ కిట్స్‌ను అందజేశారు. స్పోర్ట్స్ కిట్స్‌తో గ్రామాల్లో మంచి వాతావరణం ఏర్పడుతుందని, యువత సద్వినియోగం చేసుకుని క్రీడారంగాల్లో రాణించాలన్నారు ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవాగౌడ్, ఎంపీడీవో శ్రీరామ్, వార్డుసభ్యులు బయ్యన్న, రమేశ్, కార్యదర్శి లిఖిత పాల్గొన్నారు.



పాపన్నపేటలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పద్మ

## ఎమ్మెల్యే పరామర్శ.. ఆర్థిక సాయం

పాపన్నపేట, అక్టోబర్ 5: పాపన్నపేటతోపాటు మండల పరిధిలోని ఆరెపల్లి గ్రామాల్లో అనారోగ్యంతో మృతి చెందిన దుర్గవ్వ, రాజుల మృతదేహాలకు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా దహన సంస్కారాలకు ఇరు కుటుంబాల సభ్యులకు రూ.10 వేల చొప్పున అందజేశారు. ఎమ్మెల్యే వెంట పార్టీ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జగన్, సర్పంచ్ గురుమూర్తి గౌడ్, పాపన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## ఒకే కుటుంబంలో ముగ్గురికి పోలీస్ కొలువులు

నిజాంపేట/చిలిపిచెడ్/వెల్దుర్తి/కొల్చారం, అక్టోబర్ 5: గురువారం ప్రకటించిన పోలీసు కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో నిజాంపేట మండలంలోని నందిగామ గ్రామానికి చెందిన సంగు లక్ష్మి దుర్గయ్య దంపతుల ముగ్గురు కుమారులు పోలీస్ కొలువులు సాధించారు. సంగు శ్రావణ్, సంగు సందీప్‌లు (టీఎస్ఎస్‌పీ), సంగు ప్రశాంత్ (ఏఆర్) కానిస్టేబుల్ కొలువులు సాధించారు. కుమారులు ముగ్గురికి పోలీస్ కొలువులు రావడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ముగ్గురు అన్నదమ్ములను సర్పంచ్ ప్రీతితో పాటు నిజాంపేట ఎంపీపీ సిద్దిరాములు, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు సంగుస్వామి అభినందించారు.

☛ పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో చిలిపిచెడ్ మండలం నుంచి 8 మంది యువకులు వివిధ సర్వీసుల్లో ఉద్యోగాలు సాధించారు. చిలిపిచెడ్ మండలం చండూర్‌లో ఏడుగురు యువకులు, సోమక్కపేట గ్రామానికి ఒకరు కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు.మండలంలోని చండూర్‌కి చెందిన దయ్యాల భాను ప్రసాద్(సివిల్), సంగ్రు బాలకృష్ణ (టీఎస్ఎస్‌పీ), కుమ్మరి బాలకృష్ణ (టీఎస్ఎస్‌పీ), అఖిల్(సివిల్), నిఖిల్(ఏఆర్), సోమక్కపేటకి చెందిన రాదగోని సందీప్‌గౌడ్(సివిల్), బెస్త శ్రీకాంత్ (ఎక్సైజ్), జగ్గంపేటకి చెందిన నదరు రాకేశ్ (సివిల్) ఉద్యోగాలు సాధించారు.



పోలీసు కొలువులు ఎంపికైన ముగ్గురు అన్నదమ్ములు

☛ మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు నవీన్ గౌడ్, మధుగౌడ్‌లతో పాటు తన్నీరు విష్ణు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. నవీన్‌గౌడ్ ఎక్సైజ్, మధు, విష్ణు సివిల్ కానిస్టేబుల్‌కు ఎంపిక అయ్యారు. కానిస్టేబుల్‌కు ఎంపికైన యువకులను గురువారం స్థానిక ఎల్లమ్మ దేవాలయంలో గౌడ సంఘం నాయకులు శేఖరగౌడ్, వెంకాగౌడ్, శివ్వాగౌడ్‌లతో పాటు పలువురు శాలువాలతో సత్కరించారు.

☛ పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో కొల్చారం మండలంలోని సంగాయిపేట గ్రామానికి చెందిన పెద్ది కృష్ణవేణి, శేరిపల్లి దుర్గమణి ఎంపికయ్యారు. వ్యవసాయ నేపథ్యం ఉన్న కుటుంబాల నుంచి ఇద్దరు మహిళలు పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపిక కావడంతో గ్రామస్తులు వారిని అభినందించారు.



ఆయిల్‌పామ్‌పై అవగాహన కల్పిస్తున్న ఏవో యాదగిరి

## ఆయిల్ పామ్‌తో అధిక లాభాలు

చేగుంట, అక్టోబర్ 5: ఆయిల్‌పామ్ పంటలను సాగు చేస్తే రైతులు అధిక లాభాలు పొందే అవకాశం ఉందని నార్సింగి మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.యాదగిరి పేర్కొన్నారు. నార్సింగి మండల కేంద్రంలో గురువారం రైతులకు ఆయిల్‌పామ్‌పై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు స్వంత బోర్‌తో కూడిన నీటి సౌకర్యం, పట్టా పాసు బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో వచ్చి వ్యవసాయశాఖ అధికారుల వద్ద ఆన్‌లైన్ చేయించుకోవాలని ఏవో యాదగిరి సూచించారు. కార్యక్రమంలో రైతులు పుట్ట నాగులు, సంద మల్లేశం, రాజు, పుట్ట సత్తయ్య, నాగరాజు, గుర్రాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన

టేక్మాల్, అక్టోబర్ 5: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం (నేడు) ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు గురువారం మండల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప తెలిపారు. మండలంలోని సర్మాన్‌కుంట తాండ గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి, వివిధ గ్రామాల్లోని ఎస్టీ కమ్యూనిటీ హాళ్ల భవనాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. తండాలను పంచాయతీలుగా, గిరిజనులకు పోడు భూములు అందేలా చేసిన ఘనత కేవలం ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లే సాధ్యమైందన్నారు. ఆయన వెంట మండల ప్రధాన కార్యదర్శి అవినాశ్ , మండల బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



మాసాయిపేట రామప్ప చెరువులో చేపపిల్లలను వదులుతున్న సర్పంచ్, ఎంపీటీసీలు

## మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట

వెల్దుర్తి, అక్టోబర్ 5: తెలంగాణ ప్రభుత్వం మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేస్తూ చేయూతనిస్తుందని మాసాయిపేట సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం గ్రామ శివారులోని రామప్పచెరువులో ప్రభుత్వం పంపిణీ చేసే ఉచిత చేప పిల్లలను ఎంపీటీసీ కృష్ణారెడ్డితో కలిసి వదిలారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు కులవృత్తులను నిర్వీర్యం చేశాయని, సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ సర్కార్ కులవృత్తులను ప్రోత్సహిస్తూ వారికి అండగా నిలుస్తుందన్నారు. నేడు గ్రామాల్లో కులవృత్తులు మళ్లీ కళకళలాడుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

## పత్తిపంటలో మెళకువలు పాటించాలి

రామాయంపేట, అక్టోబర్ 5: పత్తి పంటలో ఆధునిక పద్ధతులు పాటించాలని రామాయంపేట ఏడీఏ వసంత సుగుణ, శాస్త్రవేత్త శోభారాణి, ఎంపీపీ నార్సిపేట భిక్షపతి రైతులకు సూచించారు. గురువారం రామాయంపేట మండలంలోని కోనాపూర్‌తోపాటు పలు గ్రామాల్లో పత్తిపంటలను రైతులతో కలిసి వారు పరిశీలించారు. పత్తిపంటకు రసాయనిక ఎరువులను మోతాదుకు మించి వాడొద్దని, పత్తిని అధిక సాగు విధానంతో పండించాలన్నారు. పత్తి సాగుచేసే రైతులందరు మీసేవ సెంటర్లలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కోనాపూర్‌కి చెందిన నక్క సంజీవును ఆదర్శంగా తీసుకుని, సేంద్రీయ ఎరువుల వాడకాన్ని ఎక్కువగా వాడాలన్నారు. పత్తి పంటలో ప్రధాన సమస్య పురుగు పట్టడం ఎక్కువ శాతం పత్తి పంటలో గులాబీ రంగు పురుగు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ పురుగు నివారణకు 'మోపిక్వాట్ క్లోరైడ్' రసాయనాలను పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రామాయంపేట ఏవో రాజ్‌నారాయణ, సర్పంచ్ చంద్రకళ, ఏఈవోలు సాయికృష్ణ, రాజు, ఇమ్మానియేల్‌లు పాల్గొన్నారు.



పత్తిపంటను సందర్శిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

### అంగన్‌వాడీల సంబురాలు

నర్సాపూర్, అక్టోబర్ 5: అంగన్‌వాడీల డిమాండ్‌లను తెలంగాణ ప్రభుత్వం నెరవేర్చినందుకు గురువారం నర్సాపూర్ పట్టణంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సంబురాలు జరుపుకున్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో టపాసులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. తమ డిమాండ్లను మన్నించి సమస్యలను పరిష్కరించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అంగన్‌వాడీ అధ్యక్షులు అన్నపూర్ణ, కార్యదర్శి నర్సమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు సన్మానం

చేగుంట, అక్టోబర్ 5: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకరణ చేసిన బక్కి వెంకటయ్యను గురువారం రెడ్డిపల్లి సొసైటీ చైర్మన్ మ్యాకల పరమేశ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు.

### హరీశ్‌రావును కలిసిన ఎంపీపీ సబిత

చేగుంట, అక్టోబర్ 5: నార్సింగి ఎంపీపీ చిందం సబిత పుట్టిన రోజు సందర్భంగా మంత్రి హరీశ్‌రావును సిద్దిపేటలోని మంత్రి క్యాంపు కార్యాలయంతో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీపీ సబితను మంత్రి హరీశ్‌రావు శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మైలరా సత్యనారాయణ, బీఆర్ఎస్ నార్సింగి పట్టణ శాఖ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు కుమ్మరి నర్సింహులు తదితరులున్నారు.

### ఆశ వర్కర్లతో వ్యంగ్యంగా మాట్లాడలేదు

● ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హర్షిత

కొల్చారం, అక్టోబర్ 5: ఆశ వర్కర్లతో తాను వ్యంగ్యంగా మాట్లాడలేదని, బెదిరించారనటం అవాస్తవమని రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హర్షిత స్పష్టం చేశారు. గురువారం ఆమె పీహెచ్‌సీలో మాట్లాడుతూ ఆశ వర్కర్లు ధర్నాకు వెళ్లనీయకుండా తాను ఇబ్బందులకు గురి చేసినట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం తప్పుడు ప్రకటనలు ఇచ్చారని ఆరోపించారు. రంగంపేట పీహెచ్‌సీ పరిధిలోని ఆశ వర్కర్లు సీఐటీయూ అనుబంధ సంస్థలో పని చేయడం లేదని, వారు మరో యూనియన్‌లో ఉన్నారని తెలిపారు. తమ యూనియన్ ధర్నా చేయడం లేదని, తాము ధర్నాలో పాల్గొనేది లేదని వారే స్వయంగా లేఖను సమావేశంలో డాక్టర్ హర్షిత చూపించారు. వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు ఆరోపణలు చేయడం తగదని ఆమె సూచించారు.

## 8న మార్షల్ ఆర్ట్స్ ఎంపికలు

నర్సాపూర్, అక్టోబర్ 5: నర్సాపూర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 8వ తేదీన మార్షల్ ఆర్ట్స్ అండర్-17 బాలుర, బాలికల ఉమ్మడి మెదక్ జిల్లాల ఎంపికలు జరగనున్నాయని గురువారం ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేశ్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 8వ తేదీ (ఆదివారం)ఉదయం 9 గంటలకు బోనోఫైడ్‌తో హాజరుకావాలని, వివరాలకు పీఈటీ పూర్ణచందర్ 9440080370ను సంప్రదించాలని సూచించారు.

## గోపూజతో ఇంటికి పవిత్రత

రామాయంపేట, అక్టోబర్ 5: ప్రతిరోజు ఇంట్లో గోపూజ, తులసి పూజ చేస్తే ఇంటికి ఎంతో పవిత్రత లభిస్తుందని ప్రముఖ వేదాంతి, పండితుడు వేదకరాచార్య అన్నారు. గురువారం రామాయంపేట పట్టణంలోని గోగ్రస నిలయంలోని గోశాలలో యజ్ఞహోమాలు, తులసిమాత పూజలు చేపట్టారు. కార్యక్రమానికి పట్టణంలోని మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా వీహెచ్‌పీ అధ్యక్షుడు పబ్బ సత్యనారాయణ, సంగమేశ్వర్, ఏలూరి రవీందర్‌గుప్తా, ముత్యాలు, రాజు, రఘుపతిగౌడ్, మల్లేశం, అనంతలక్ష్మి, చంద్రకళ, స్వర్ణ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.